


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**విమానానికి ఎదురుగా** ఉన్న భవనం నుండి బయటకు పరుగెత్తుకుని వచ్చిన ఒక వ్యక్తి ఏదో ఆలోచన వచ్చినట్లు, ఒక జీపులోకి ఎక్కి విమానానికి ఎదురుగా నడపసాగాడు.

విమానం వేగం మరింత పెంచింది ఫ్లోరెన్స్.

"ఎదురుగా ఆ జీపు చూడు మన వైపే వస్తోంది..." అంది మధుబాల భయపడుతూ.

"కాసేపు కళ్ళు మూసుకో..." అంటూ ఫ్లోరెన్స్ విమానాన్ని కుడి వైపుకు తిప్పింది. జీపు కూడా అటే తిరిగింది.

చూస్తుండగానే రెంటికీ మధ్య దూరం మరింత తగ్గి పోయింది. జరగబోయే ప్రమాదాన్ని తలచుకుని మధుబాల రెండు చేతుల్లో తన మొహాన్ని దాచుకుంది.

ఆఖరి నిమిషంలో విమానాన్ని ఎడమ చేతి వైపు తిప్పినట్లు తిప్పి తిన్నగా పోనిచ్చింది ఫ్లోరెన్స్. ఇంకేముంది జీపు విమానానికి గుద్దుకోబోతోందని దానిలో నుండి దూకేశాడు జీపు నడుపుతున్న వ్యక్తి. జీపును తప్పించుకున్న విమానం గాల్లోకి లేచింది. ఎత్తుగా ఉన్న ప్రహరీ గోడను అతి కష్టం మీద దాటి, హుగ్లీ నది మీద ఎగురుతూ దూసుకు పోయింది.

ఫోర్ట్ విలియమ్‌లో ఎవరికీ... ఏం జరుగుతుందో, విమానం నడుపుకుంటూ వెళ్లింది ఎవరో అర్థం కాలేదు.

వార్నర్‌ని నిద్ర లేపటానికి అతని ఇంటికి వెళ్లి ఎంత ప్రయత్నించినా అతను సమాధానం ఇవ్వలేదు. చివరకు ఇంట్లోకి వెళ్లి చూస్తే కాళ్లూ, చేతులూ కట్టేసి ఉన్న వార్నర్ వారికి కనిపించాడు.

వెంటనే అతన్ని విడిపించారు.

"ఆ ఇద్దరు ఏరి?" అంటూ ఆందోళనగా బయటకు వచ్చాడు వార్నర్.

విమానాన్ని తీసుకుని వెళ్లిపోయారని తెలిసి హతాశుడయ్యాడు.

“ఎట్టి పరిస్థితుల్లో వాళ్ళు మన సరిహద్దులు దాటి వెళ్లకూడదు. పైలెట్‌ని పిలవండి.” అన్నాడు.

రెండు నిమిషాల్లో విమానం పైలెట్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

“విమానాన్ని, దానిలో ఉన్న ఇద్దరినీ పేల్చేయ్. వారిద్దరిలో ఎవరూ బ్రతికి ఉండటానికి వీలులేదు...” అంటూ పెద్దగా అరిచాడు వార్నర్.

ఆగమేఘాల మీద రెండో విమానం బయదేరింది.

రెండు విమానాలకు మధ్య పావు గంట ఎడం ఉంది. దూరంలో చూసుకుంటే అది దాదాపు వంద కిలోమీటర్ల దూరం. అంత తేడా ఉంటే ఆకాశంలో ఇంకో విమానాన్ని పట్టుకోవటం దాదాపు అసాధ్యం. అంతేకాదు ఖచ్చితంగా ముందు విమానం ఎటు వెళ్తుందో కూడా తెలియదు. కాకపోతే ఒక అనుకూలమయిన విషయం ఏమిటంటే దానిని నడుపుతోంది అనుభవం లేని ఒక యువతి. పైగా అందులో ఇద్దరు ఉన్నారు. ఇందులో ఒకడే పైలెట్. మోయవలసిన బరువు తక్కువ కాబట్టి రెండో విమానం వేగంగా వెళ్తుంది.

ఇంతలో ఆకాశంలో సూర్యోదయం అయి వెలుతురు రావటం మొదలయింది.

ఇదొక్కటి శుభ సూచకం అనుకున్నాడు విమానాన్ని నడుపుతున్న పైలెట్. విమానాన్ని పూర్తి వేగంతో నడుపుతున్నాడు. ఎదుటి విమానం వెళ్ళిన దిక్కును బట్టి తన విమానాన్ని కూడా అటు నడుపుతున్నాడు.

దాదాపు మూడు గంటలు గడిచి పోయాయి.

కలకత్తా నుండి కోహిమాకు మధ్య ఏరియల్ డిస్టెన్స్ 670 కిలోమీటర్లు ఉంటుంది. అంటే దాదాపు నాలుగు గంటల నుండి అయిదు గంటల సమయం పడుతుంది. అందులో మూడు గంటలు అయిపోయాయి.

ఇక తనకు వారి విమానం కనిపించే అవకాశం లేదు అని అతను నిరాశపడుతున్న సమయంలో దూరంగా ఆకాశంలో పసుపు పచ్చ రంగులో మిలమిలలాడుతూ కనిపించింది టైగర్‌మోత్ విమానం.

మిలటరీ స్థావరం నుండి బయటపడిన కాంచనమాల చాలా జాగ్రత్తగా ఎవరి కంటా పడకుండా రోడ్డు వరకు చేరుకుంది.

ఒక చేతిలో రివాల్వర్ పట్టుకుని రోడ్డు పక్కన ఉన్న గుబుర్ల మధ్య దాక్కుంది.

తెలతెలవారుతుండగా ఒక వ్యక్తి మోటర్‌సైకిల్ మీద రోడ్డు మీద వస్తూ కనిపించాడు. తిన్నగా రోడ్డు మధ్యకు నడిచి రివాల్వర్ అతనికి గురి పెట్టింది.

అతను మోటర్‌సైకిల్ ఆపి చేతులు పైకి ఎత్తి నిలబడ్డాడు.

అతనితో ఏమీ మాట్లాడకుండా ఆమె మోటర్‌సైకిల్ ఎక్కి కోహిమా వైపు బయలు దేరింది.

తూర్పు దిక్కున సూర్యుడు ఉదయిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడు అత్యంత తక్కువ ఎత్తులో ఎగురుతున్న విమానం మోత వినిపించింది.

"ఎలా ఉంది విమాన ప్రయాణం?" వేగంగా వీస్తున్న గాలి హోరులో వినిపించటానికి స్వరం పెద్దది చేసి అడిగింది ఫ్లోరెన్స్.

"ఇంకాస్త వేగం తగ్గిస్తే బాగుంటుందేమో..." అంది మధుబాల. వారికి పైలెట్లు పెట్టుకునే హెల్మెట్లు లేవు. గాగుల్స్ లేవు. చలి గాలి చీరేస్తున్నట్లు మొహానికి తగులుతోంది.

"ఇంకెంత! కోహిమా వెళ్లటానికి మరో అరగంట కూడా పట్టదు..." అంది ఫ్లోరెన్స్.

"ఇంతలో వెనుక నుండి రొద లాంటి ధ్వని వినిపించి వెనక్కి తిరిగి చూసింది వెనుక సీట్లో కూర్చున్న మధుబాల.

తరుముకు వస్తున్న విమానం కనిపించింది.

"ఫ్లోరెన్స్!... వెనుక నుండి విమానం వస్తోంది." అరిచింది మధుబాల.

ఫ్లోరెన్స్ వెనక్కి తిరిగి కూడా చూడకుండా తన విమానపు వేగాన్ని పూర్తి స్థాయికి పెంచింది.

వెనుక విమానం నడుపుతున్న పైలెట్ రెట్టించిన ఉత్సాహంతో ముందు విమానాన్ని అందుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని ప్రయత్నాలు క్రమక్రమంగా ఫలించి రెండు విమానాల మధ్య దూరం తగ్గి పోతోంది.

ఇంకా ముందు విమానం ఫైరింగ్ రేంజ్‌లోకి రాకపోయినా మెషీన్ గన్ తో కాల్పులు మొదలు పెట్టాడు పైలెట్. హడావుడిగా గాలిలోకి ఎగరటం వలన విమానంలో ఉన్న ఆయిధాలను తయారుగా ఉంచలేదు. మెషీన్ గన్‌లో బుల్లెట్లు కూడా నింపలేదు. అందుకే కొన్ని బులెట్లు మాత్రం పేల్చి ఆపాడు. ఇక కొన్ని బుల్లెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. అతనికి ముందు విమానం నడుపుతున్నది ఇద్దరు అమ్మాయిలు అని తెలుసు. కాల్పులు మొదలు పెడితే వారు భయపడిపోతారని అనుకున్నాడతను.

అయితే అతని ప్రయత్నం వ్యతిరేక ఫలితాన్నిచ్చింది.

"మధుబాలా! రివాల్వర్ తీసి సిద్ధంగా పట్టుకో..." అంటూనే ఫ్లోరెన్స్ తన విమానాన్ని 180 డిగ్రీల కోణంలో వెనక్కి తిప్పింది.

"ఎందుకలా చేస్తున్నావ్?" అడిగింది మధుబాల.

"మనం ఇద్దరం ఉన్నాం. అతను ఒక్కడు ఉన్నాడు. అది మన బలహీనత అనుకుంటున్నాడతను. అదే మన బలం అని ఋజువు చేద్దాం..."

"ఎలా?"

"అతను విమానాన్ని నడపటం తప్ప మన మీద కాల్పులు జరపలేదు. మెషీన్ గన్ మోతని బట్టి దానిలో బుల్లెట్లు లేవని తెలుస్తోంది. కాబట్టి మన విమానాన్ని ఆ విమానానికి ఎదురుగా నడిపిస్తాను. నువ్వు అతన్ని కాల్చు..."

మధుబాల రివాల్వర్ తీసి చేతిలో పట్టుకుంది.

రెండు విమానాలు వేగంగా దగ్గరకు వస్తున్నాయి.

బాగా దగ్గరకు వచ్చాక మిగిలిన కొన్ని బుల్లెట్లతో ఎదుటి విమానం మీద దాడి చేయాలని నిర్ణయించుకున్నాడు పైలెట్.

మధుబాల తన చేతిని విమానం ఉపరితలం మీద ఆనించి ఎదుటి పైలెట్ వైపు గురి చూసుకుంటోంది. కనురెప్ప పాటులో రెండు విమానాలు దగ్గరకు వచ్చాయి.

పైలెట్ మెషీన్ గన్ కాల్పులు మొదలు పెట్టాడు.

మధుబాల ఒక బుల్లెట్ పేల్చింది. రెండవ బుల్లెట్ పేల్చే లోపు విమానం దూరంగా వెళ్ళి పోయింది. బుల్లెట్ పైలెట్‌కి తగిలిందో లేదో అని ఆ విమానం వైపే చూస్తూ ఉండి పోయింది ఆమె. తిన్నగా ముందుకు వెళ్తున్న శత్రు విమానం హఠాత్తుగా నేల వైపు దూసుకెళ్లసాగింది. బుల్లెట్ దిగిన పైలెట్ స్పృహ తప్పి జాయ్‌స్టిక్ మీదకు ఒరిగి పోవటంతో విమానం కిందకు వెళ్ళిపోతోందని అర్థం చేసుకుంది ఆమె.

ఆమె చూస్తుండగానే ఆ విమానం నేలకు గుద్దుకుని పెద్ద శబ్దంతో పేలి పోయింది.

“యస్! మనం సాధించాం...” అంటూ ముందుకు తిరిగింది మధుబాల.

ఫ్లోరెన్స్ తన సీట్లో ఒక పక్కకు ఒరిగి పోయి ఉంది. “ఏయ్ ఫ్లోరెన్స్ ఏమయింది?” అంటూ అరిచింది మధుబాల.

అయితే ఫ్లోరెన్స్‌లో చలనం లేదు.

“ఫ్లోరెన్స్, ఫ్లోరెన్స్...” అంటూ ఎన్ని సార్లు అరిచినా ఆమె స్పందించక పోవటంతో ఎదుటి విమానం నుండి పేలిన మెషిన్ గన్ బుల్లెట్ ఆమెకు తగిలి ఉంటుందని మధుబాలకు అర్థమయింది.

తమలో ఎవరు చనిపోయినా మిగిలిన వారు ఏడవ కూడదని ముందే అనుకున్నారు వారు అయిదుగురు. అయినా మధుబాల కళ్లు నీళ్లతో నిండి పోయాయి. ఎక్కడో ఇంగ్లండు దేశంలో పుట్టింది. ఇక్కడ, ఇలా... తన వారనుకున్న వారి కోసం, తనకు సంబంధం లేని విషయంలో తల దూర్చి చనిపోయింది.

ఇంతలో ఒక్కసారిగా విమానం కంపనానికి లోనయింది.

అప్పుడు గుర్తుకు వచ్చింది మధుబాలకు, తాను ఆకాశంలో ఎగురుతున్న విమానంలో ఉన్నానని... తనకు దానిని దించటం చేతకాదని.

విమానం ఎగిరే ముందు ఫ్లోరెన్స్ విమానం గురించి చెప్పిన నాలుగు ముక్కలు పరధ్యానంగా వింది.

శత్రు విమానం పేల్చిన బుల్లెట్లు ఫ్లోరెన్సుకు మాత్రమే కాదు, విమానం ఇంజిన్‌కు కూడా తగిలినట్లు ఉన్నాయి. విమానం ఇంజిన్ నుండి నల్లటి పొగ రావటం మొదలయింది.

ఈ విమానాన్ని ముందు కూర్చున్న వాళ్లు, వెనుక కూర్చున్న వాళ్లు ఎవరయినా నడపవచ్చు. తన ముందు ఉన్న జాయ్‌స్టిక్ కొద్దిగా ముందుకు వంచింది మధుబాల. విమానం కిందకు దిగింది. అలా ఎత్తు తగ్గించుకుంటూ వచ్చింది మధుబాల.

కింద కనిపిస్తోన్న పరిసరాలను బట్టి తాను కోహిమాకు ఎంతో దూరంలో ఉండనని అర్థం చేసుకుంది ఆమె.

ఇంతలో కింద ఒక రోడ్డు కనిపించింది. ఆ రోడ్డు ఇప్పుడే అడవిలో నుండి మైదాన ప్రాంతంలోకి ప్రవేశిస్తోంది. ఆ మైదానం చదునుగా ఉండి బాగా గడ్డి పెరిగి ఉంది. అక్కడయితే విమానాన్ని దించటానికి వీలుగా ఉంటుందని అనుకుంది కాంచనమాల.

విమానాన్ని మరింత కిందకు దించింది. ఒక రౌండు కొట్టి మైదానం మీద దిగటానికి వీలుగా విమానాన్ని కిందకు తీసుకు వచ్చింది. రోడ్డు మీద ఏదో మోటర్ సైకిల్ వెళ్తోంది.

ఆమె విమానాన్ని దించటానికి ప్రయత్నించింది.

అనుభవజ్ఞులకే కష్టసాధ్యమయిన పని అది. ఆమెకు ఓనమాలు కూడా రావు. అందుకే నెమ్మదిగా నేలకు తాకాల్సిన విమానం ధడ్ అంటూ తాకింది. ల్యాండింగ్ గేర్ విరిగి పోయింది. విమానం నేలను రాసుకుంటూ వెళ్ళి ఒక పక్కకు ఒరిగి ఆగింది.

ఆ అదుటుకు మధుబాల స్పృహ తప్పి పోయింది.

అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ వెళ్ళిన విమానం రోడ్డు పక్కన ఉన్న మైదానంలో పెద్ద శబ్దం చేస్తూ కూలిపోయింది.

తన నెత్తి మీదగా వెళ్ళి కూలిపోయిన విమానాన్ని ఆశ్చర్యంతో చూస్తూ ఉండి పోయింది కాంచనమాల.

తన దారిన తాను వెళ్లిపోదామనుకుని కూడా మానవత్వం చంపుకోలేక పోయింది. మోటర్‌సైకిల్ రోడ్డు మీద ఆపి విమానం దగ్గరకు పరుగెత్తింది కాంచనమాల.

దగ్గరకు వచ్చే కొద్దీ అందులో ఉన్న మనుషులు తనకు తెలిసినవారని అర్థమయింది ఆమెకు.

ముందు సీట్లో ఉన్న ఫ్లోరెన్స్ ప్రాణాలు ఎప్పుడో పోయాయి. వెనుక సీటులో ఉన్న మధుబాల మాత్రం ఊపిరి పీలుస్తోంది.

అతి కష్టం మీద విమానం నుండి మధుబాలను కిందకు దించింది కాంచనమాల. ఆ తరువాత ఆమెను విమానం నుండి దూరంగా తీసుకు వెళ్లసాగింది.

ఒరిగిపోయిన విమానపు ట్యాంకుల నుండి ఇంధనం కారి చుట్టూ పరచుకుంటోంది. ప్రమాదం కారణంగా ఎగసిపడిన నిప్పు రవ్వల కారణంగా అది అంటుకుని విమానం ఎప్పుడయినా పేలిపోయే అవకాశం ఉంది.

ఎక్కువ దూరం వెళ్లక ముందే పెద్ద శబ్దం చేస్తూ విమానం పేలిపోయింది.

మధుబాల, కాంచనమాల ప్రయాణిస్తున్న మోటర్‌సైకిల్ కోహిమా పొలిమేరల్లోకి ప్రవేశించింది.

తను ప్రాణాలతో విమాన ప్రమాదం నుండి బయటపడిన ఆనందం కంటే, ఫ్లోరెన్స్ చనిపోయిన షాక్ ఎక్కువగా కుంగదీస్తోంది మధుబాలను. కాంచనమాల ఆమెను ఎంతగా ఓదార్చినా ఆమె తేరుకోలేక పోతోంది.

కాంచనమాల తమ బైకును సరాసరి అచింత్, డోల్మా ఉండే కోహిమా బేకరీ వైపు నడిపింది.

బేకరీ తెరచి ఉంది. జనాలు చాలా పలుచగా ఉన్నారు. "అచింత్ ఉన్నాడా" అని అడిగింది బేకరీలో పనిచేస్తున్న ఒక వ్యక్తిని.

అతను ఈమె వైపు విచిత్రంగా చూసి, "మీకు తెలియదా?" అన్నాడు.

"ఏమి తెలియాలి?" అతనేమి మాట్లాడుతున్నాడో అర్థం కాక అంది కాంచనమాల.

"అచింత్ కాల్పుల్లో చనిపోయాడు."

కాంచనమాల నోటి మీద చెయ్యి వేసుకుంది. "ఎప్పుడు జరిగింది ఇది?" అని అడిగింది అపనమ్మకంగా.

"రెండు రోజుల క్రితం."

"మరి ఒక అమ్మాయి పై గదిలో ఉండాలి. ఆ అమ్మాయి ఏమయింది?" అడిగింది కాంచనమాల.

"ఏ అమ్మాయి? అమ్మాయి గురించి మాకు తెలియదు. ప్రస్తుతం పైన గదికి పోలీసులు సీల్ వేశారు. అందులో ఎవరూ లేరు..." చెప్పాడతను.

కాంచనమాల, మధుబాల ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. దూరంగా వెళ్లాక మాట్లాడుకోవటం మొదలు పెట్టారు. "ఇవాళ తారీకు ఎంత?" అడిగింది మధుబాల.

"ఏప్రిల్ 4..."

"మామూలుగా ఒకటవ తారీకునే దాడి చేసి ఉండేవారు. మనం పంపే సమాచారం కోసం ఎదురు చూస్తూ ఇప్పటి వరకు ఆగి ఉంటారు. ఇంకా ఆలస్యం చేస్తే ఫలితం ఉండదు. మన వాళ్ళు బ్రిటిషు వాళ్ల మోసానికి మరోసారి బలయిపోతారు..." అంది కాంచనమాల.

వాళ్ళు విడిపోక ముందే ఇలాంటి పరిస్థితి ఎదురయితే అందరూ కలుసుకోవటానికి మరొక రహస్య సమావేశ ప్రదేశాన్ని గుర్తించి పెట్టుకున్నారు. అందుకే మధుబాల, "డోల్మాని కనిపెట్టటం అంత కష్టం కాదు. సాయంత్రం అయిదు గంటలకు 'చిమ్నీ హట్' రెస్టారెంటుకు వస్తుంది. కానీ రేడియో ఆమె దగ్గర ఉన్నదా, లేదా? అది ముఖ్యం..." అంది.

"ఆ విషయం సాయంత్రం అయిదు గంటలకు కానీ తెలియదు..." అంది కాంచనమాల.

‘చిమ్నీ హట్’ రెస్టారెంట్ సాయంత్రం పూట బాగా రద్దీగా ఉంటుంది. అందుకే ఆ రెస్టారెంటును, ఆ సమయాన్నీ ఎంచుకున్నారు వారు. ఆ నిర్ణయం తీసుకున్నపుడు అయిదుగురు ఉన్నారు. వారిలో ఇప్పుడు ముగ్గురు మాత్రమే మిగిలి ఉన్నారు.

అనుకున్న సమయానికి అక్కడకు వచ్చి కూర్చున్నారు కాంచనమాల, మధుబాల.

కాసేపటి తరువాత డోల్మా అక్కడకు వచ్చింది. వీరిద్దరినీ చూడగానే ఆమె మొహం వికసించింది. వీరున్న టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చుంది. “మిగిలిన ఇద్దరు ఏరి?” అని అడిగింది కూర్చోవటంతోనే.

తామే ఏదో తప్పు చేసినట్లు తలదించుకున్నారు కాంచనమాల, మధుబాల.

ఏం జరిగి ఉంటుందో అర్థం చేసుకుంది డోల్మా. “కనీసం మనకు కావలసిన సమాచారం దొరికిందా?”

“దొరికింది. అసలు ఏం జరిగింది అంటే...” అంటూ తమకు తెలిసిన విషయాలు చెప్పుకు వచ్చారు. “సమయం మించిపోక ముందే ఈ విషయాలు మనం హెడ్‌క్వార్టర్‌కు చేరవేయాలి...” అన్నారు వారు.

“రేడియో నా దగ్గరే ఉంది...” వీపున ఉన్న బ్యాగును చూపిస్తూ అంది డోల్మా. “ఎవరినీ నమ్మి దీనిని ఎక్కడా దాయలేక, వీపున పెట్టుకుని తిరుగుతున్నాను.”

“అయితే పద, ఆ పనిలో ఉందాం...” అంటూ లేచారు వారు.

ప్రతిసారీ కోహిమా నుండి రేడియో సందేశం వెళ్తున్నప్పుడల్లా దానిని ఛేదించే పనిలో కోహిమాలో ఉన్న బ్రిటిషు సైనికులు నిమగ్నమవటం, ఫెయిలవటం జరుగుతూనే ఉంది. దానికి కారణం వారు సందేశం ఖచ్చితంగా ఎక్కడ నుండి వెళ్తుందో ట్రేస్ చేయక ముందే రేడియో ఆఫ్ అవటం. సందేశం పంపటంలో అచింత్ వేగం వల్ల అది సాధ్యం అవుతోంది.

ఇప్పుడు కూడా డోల్మా సందేశం పంపటం మొదలు పెట్టగానే కోహిమాలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆఫీసులో హడావుడి మొదలయింది. అయితే ఎప్పటిలా ఈసారి సందేశం వేగంగా ముగిసి పోలేదు. దానికి కారణం డోల్మా అనుభవ లేమి.

ప్రస్తుతం డోల్మాతో పాటు కాంచనమాల, మధుబాల ఒక చిన్న గుట్ట మీద కూర్చుని ఉన్నారు. అక్కడ నుండి నాలుగు వేపుల ఉన్న పరిసరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె అచింత్ అంత వేగంగా మోర్స్ కోడ్ పంపలేక పోతోంది. పైగా సగం సందేశం పంపాక ట్రాన్స్‌మిషన్ బటన్ ఆన్ చేయలేదని చూసుకుంది. దాంతో తిరిగి మొదటి నుంచి మొదలు పెట్టాల్సి వచ్చింది.

అప్పటికే కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు సందేశం ఎక్కడ నుండి వస్తుందో కనిపెట్టారు. వారి అదృష్టం కొద్దీ, ఆ ప్రదేశానికి దగ్గరలోనే మిలటరీ యూనిట్ ఒకటి ఉంది. వారికి సందేశం వస్తున్న ప్రదేశం గురించి చెప్పారు.

ఇంకా సందేశం సగం కూడా పంపక ముందే బ్రిటిషు సైనికులు గుట్టని చుట్టుముట్టారు.

గుట్ట మీద ఉన్న ముగ్గురికీ పైకి వస్తున్న సైనికులు స్పష్టంగా కనపడుతున్నారు.

"మీరు వెళ్ళిపోండి. ఒక్క పని కోసం ముగ్గురి ప్రాణాలు ప్రమాదంలో పెట్టటం వృధా..." అంది డోల్మా.

"నిన్ను ఒంటరిగా విడిచి మేము ఎక్కడకీ వెళ్లం..." అన్నారు వారు.

"మీరు వెళ్లకపోతే నేను సందేశం పంపను." చేస్తున్న పని ఆపుతూ అంది డోల్మా.

"వద్దు. మన ప్రాణాల కంటే సందేశం పంపటం ముఖ్యం..." చెప్పింది మధుబాల.

"అయితే నన్ను ఒంటరిగా వదిలి మీరు వెళ్లిపోండి..." అంది డోల్మా.

తన రివాల్వర్లు తీసి చేతిలో పట్టుకుని, "మేము వెళ్లటం కాదు, వచ్చే వాళ్ళను ఆపుతాం. నువు నీ పని కొనసాగించు..." అని కాంచనమాల ఒక పక్కకు వెళ్ళి గుట్ట మీదకు వస్తున్న సైనికుల మీద కాల్పులు మొదలు పెట్టింది. మధుబాల మరో వైపు నుండి అదే పని చేస్తోంది.

పై నుండి కాల్పుల శబ్దం వినిపించటంతో సైనికులు కూడా కాల్పులు మొదలు పెట్టారు. ఇరు వైపులా కాల్పులు జరుగుతున్నాయి. అయితే వీరి వద్ద ఉన్నది రెండు రివాల్వర్లు, కొన్ని అదనపు బుల్లెట్లు. అవి ఎంతో సేపు సైనికులను నిరోధించలేక పోయాయి.

ఆఖరి బుల్లెట్ కూడా పేల్చిన కాంచనమాల ఇక చేయగలిగింది ఏమీ లేక నిస్పృహగా ఆకాశం వైపు చూస్తూ ఉండి పోయింది.

పై నుండి కాల్పులు తగ్గటంతో సైనికులు తిరిగి గుట్ట పైకి ఎక్కటం మొదలు పెట్టారు.

కాంచనమాల, మధుబాల తమ ప్రాణాల మీద ఆశలు వదిలేసుకుని ప్రాణం పోవటానికి ఎదురు చూస్తున్నారు.

ఇంతలో ఆకాశంలో దూరంగా చిన్న నలకలా కనిపించింది ఒక విమానం కాంచనమాలకు. చూస్తుండగానే అది పెద్దదయి విమానం అని అర్ధమయింది. దాని వెనుక మరిన్ని విమానాలు కనిపించాయి.

ఒక విమానం అతి తక్కువ ఎత్తులో కాంచనమాల తల మీదగా ఎగురుకుంటూ పోయింది. దాని మీద ఉన్న గుర్తులను బట్టి అది జపాను యుద్ధ విమానం అని అర్ధమయింది

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS